క్లుప్తంగా

జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా షాపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. వారు బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలో తెలుగుగంగ కార్యాలయం అవరణలో ఉన్న బాణసంచా దుకాణాలను పరిశీలించి, విక్రయదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు నిబంధనలను విధిగా పాటించాలని, ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నిమాపక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫైర్ అలారమ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో మంజూరైన సిమెంట్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్ ఏఈ పి.ఇబ్రహీంఖాన్, సిచివాలయ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 పనులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 2 కోట్లు మంజూరైందన్నారు. డిసెంబర్ లోపు సిమెంట్ రోడ్డు పనులు, మదనంబేడు పాఠశాల ప్రహరీ గోడ, గాంధీపురం అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

మోటారుకు మరమ్మతులు



తాగునీటి మోటారుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ మోహన ప్రియ

రేణిగుంట: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో పాడైన తాగునీటి మోటారును మరమ్మతు చేశారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడతారని, తాగునీటి మోటారు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు సర్పంచ్ మోహనప్రియ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె బుధవారం మెకానిక్‌ను పిలిపించి మోటరు మరమ్మతు చేయించారు.

బాల నేస్తాలు.. కవి కిశోరాలు

వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేదింటి బిడ్డలు.. తెలుగు ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో చదువుతో పాటు సాహిత్యంలో పట్టుసాధించారు. తెలుగు భాషకు వన్నె తెచ్చేలా..ఛందస్సుకు అనుగుణంగా బాలనేస్తాలు రచన చేసి, సత్తా చాటారు. బాల సాహితీ వేత్త కృష్ణస్వామిరాజు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం కలివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల అక్షర సేద్యంపై ప్రత్యేక కథనం.





బాల నేస్తాలు పుస్తకంతో కథలు రాసిన విద్యార్థులు

- బాలల సృజనాత్మకతకు అక్షర రూపం బాల నేస్తాలు
- బాలసాహితీ కథా సంకలనం
- నేటి బాలలే రేపటి భాషావారసులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆలోచనల అగ్నిబాణం కవిత్వం.. ప్రగతికి ద్వారం..మనసున అలముకున్న గాఢ తపస్సు నుంచి వెలుగుల వైపు నడిపించే కవిత్వం ప్రగతికి సంకేతం. విద్యార్థుల కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని నేటి సమాజంలో మూఢత్వాన్ని తొలగించడం అనిర్వచనీయం. ఆ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పుస్తకాల్లో బోధనకే పరిమితం కాలేదు. విద్యార్థులకు సాహిత్య సృజన పాఠాలు నేర్పుతున్నారు. పిల్లల్లో రచనాసక్తిని కలిగిస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయనేందుకు నిదర్శనమిది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి ఆసక్తి కలిగిన విద్యార్థులందరికీ సాహిత్య పాఠాలు బోధిస్తున్నారు. ఖాళీ సమయాల్లో వారికి కవిత్వం, కథలు పరిచయం చేస్తున్నారు. నీతి ప్రబోధం, సామాజిక స్పృహ కలిగిన కవిత్వంపై వారికి ఆసక్తి కల్పిస్తూ వారిలో ఆలోచనలను రేకెత్తిస్తున్నారు. దీంతో పిల్లల్లో రచనాసక్తి కలిగింది. ఈ నేపథ్యంలో పాఠశాలలోని 44 మంది చిన్నారులు తమలోని సామాజిక స్పృహ, చైతన్యం, సృజనాత్మకత, ఆలోచనలకు అక్షర రూపం కల్పించారు. ఎన్నో అంశాలపై భావుకత కలిగిన కవితలను సృజించారు. ప్రతి కవితలోనూ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రకటించారు. భాష సరళమైనప్పటికీ మాన్యుల మెప్పు పొందారు. వయస్సు చిన్నదైనా మనస్సు కట్టి పడేసేలా ఎన్నో కవితలను అల్లారు. తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి ఆ కవితలను ఒక క్రమంలో అమర్చారు. బాల నేస్తాలు శీర్షికతో దాన్ని కవితా సంకలనంగా రూపొందించి, ముద్రించి, ఆవిష్కరించారు. ఈ కవితల్లో గ్రామీణ నేపథ్యం ఉన్న కారణంతోపాటు పలుకుబడిలో ఉన్న అరుదైన తెలుగు పదాల గుభాళింపు కనిపిస్తోంది.

నేటి బాలలే రేపటి భాషా వారసులు



జాతి మనుగడకు భాషే ఆధారం. భావితరాలకు తెలుగు భాషా సంపదను అందించాల్సిన బాధ్యత తెలుగువారైన మనందరిపై ఉంది. మా కల్లివెట్టు ఉన్నత పాఠశాల పిల్లల కథల్లో వారి ఊహలకు రెక్కలొచ్చి స్వేచ్ఛా విహంగాలుగా ఆకాశంలో విహరిస్తారు. ఆడుతారు, పాడుతారు, అల్లరి చేస్తారు, లక్ష్యాలను నిర్ణయించుకున్నారు. విద్యార్థుల్లోని సృజనకు అక్షర రూపం ఇవ్వాలనే సంకల్పంతో పాఠశాలలో తెలుగు కవుల, జయంతులు, వర్ధంతులు, సృజనాత్మక భాషా పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో తెలుగు భాషపై సాహిత్యాభిరుచిని, ఆసక్తిని కలిగిస్తూ కథారచనలో మెళకువలు నేర్పుతూ వారే స్వతహాగా కథలు రాసేలా తీర్చిదిద్దాను.

-యువశ్రీ మురళి, రచయిత, బాలనేస్తాలు సంపాదకులు

కథలంటే ఇష్టం



నాకు కథలు చదవడమంటే చాలా ఇష్టం. మా పాఠశాల గ్రంథాలయంలో ఉన్న బాలల కథల పుస్తకాలను చదివి అందులో నీతిని తెలుసుకుని మా తెలుగు ఉపాధ్యాయులు సాయంతో కథలు రాయడం తెలుసుకున్నాను. అలా నేను గీత అనే అమ్మాయి తన స్నేహితుల గురించి పశ్చాత్తాపం అనే కథను సొంతంగా రాయగా ఇటీవల ఆవిష్కరించిన బాల నేస్తాలు పుస్తకంలో నేను రాసిన కథను ముద్రించడం సంతోషంగా ఉంది.

- దీక్షితప్రియ, 7 వ తరగతి విద్యార్థి

నా ఆలోచనలే కథలుగా రాశాను.



మా పాఠశాల ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలు, నా ఆలోచనల ఊహలతో కథలు రాయడం తెలుసుకున్నాను. మా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి సార్ కథలపై మక్కువ కలిగించేలా ప్రేరణ కల్పించడంతో రాసిన కథలను సరిచేసుకుని ఆ కథల్లోని నీతిని గ్రహించేలా ఇప్పటి వరకు గుణపాఠం, అక్కాచెలెళ్లు, కూరగాయల రైతు, రాజేవరు వంటి కథలు రాశాను. ఆ కథలను బాల నేస్తాలు పుస్తకంలో ప్రచురించారు.

-సృజని, 7 వ తరగతి, విద్యార్థిని

కథలపై ఆసక్తితోనే రచనలు



నాకు కథలు వినడమన్నా, చదవడమన్నా చాలా ఆసక్తి. అందుకే నాకూ కథలు రాయాలనే కోరిక కలిగింది. దీంతో నాలోని ఆలోచనలకు పదునుపెట్టి మంచి, సింహం గర్వం, కుందేలు అహం, చెరపకురా చెడేవు, వంటి కథలు రాశాను. నా కథలు పుస్తకంలో అచ్చు వేశారు. మా తల్లిదండ్రులతో పాటు, తెలుగు ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో కథలు రాయడంపై ఆసక్తి కలిగింది.

-ఇందులాస్య, 7 వ తరగతి విద్యార్థిని

పుస్తక పఠనం నాకిష్టం



మా పాఠశాల గ్రంథాలయంలోని కథలు పుస్తకాలతోపాటు బహుమతులు రూపంలో వచ్చిన కథలు పుస్తకాలు చదివి నేను కథలు రాయగలనని నమ్మకం ఏర్పడడంతోపాటు తెలుగు ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో నా తెలివితేటలతో కథలు రాశాను. ఈ కథలు రాసేటప్పుడు నాకు ఎంతగానో సంతోషం వేసింది. అలా నేను తెలివైన రాజకుమారుడు, అత్యాశదోమ లు, చిలుక తెలివి, పావురాల తెలివి వంటి కథలు రాయడంతో బాల నేస్తాలు పుస్తకంలో ముద్రించారు.

-ఇషాంత్, 9 వ తరగతి, విద్యార్థి

నా ఊహలే కథలుగా..



మా తెలుగు టీచర్‌ని అడిగి ఒక్కొక్క అంశంపై స్నేహితుని ఉపాయం, స్నేహం అంటే ఏమిటో తెలుసా, అత్యాశ రామన్న, మంచికి మంచి, కథలు రాశాను. నేను రాసిన కథలు ఎక్కువగా నా ఊహలకు అనుగుణంగా మా ఊరు పరిసర ప్రాంతాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథలు రాశా ను. వాటిని బాలల నేస్తాలు పుస్తకంలో ప్రచురించడం.. పెద్దలతో సత్కారం పొందడం ఆనందంగా ఉంది. మరిన్ని కథలు రాయడానికి కృషి చేస్తాను.

-నాగరాజు, 10 వ తరగతి, విద్యార్థి

యోగా పోటీల్లో రేణిగుంట యువకుడి ప్రతిభ



బాలచందర్

రేణిగుంట: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రేణిగుంటకు చెందిన యువకుడు ప్రతిభ కనబరిచాడు. నంద్యాలలో నిర్వహించిన 37వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రేణిగుంటలోని స్వామి వివేకానంద ఫ్రీ యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా రేణిగుంటకు చెందిన బాలచందర్ వెండి పతకం, గుణశేఖర్ నాలుగో బహుమతిని కైవసం చేసుకున్నారు.

బాడీ బిల్డర్ పోటీల్లో వెంకటేష్ ప్రతిభ



ట్రోఫీతో వెంకటేష్

నారాయణవనం: జాతీయస్థాయి బాడీ బిల్డర్ పోటీల్లో స్థానిక యువకుడు వెంకటేష్ విశేష ప్రతిభను కనపరచి బెస్ట్ ఆఫ్ సిక్స్ స్థానంలో చోటు సంపాదించుకున్నాడు. బుధవారం చెన్నైలో జాతీయ స్థాయిలో బాడీ బిల్డర్ పో టీలు నిర్వహించారు. నారాయణవనం గ్రామానికి చెందిన వెంకటేష్ వివిధ స్థాయిల్లో ప్రతిభను కనబరిచినట్లు అతని తండ్రి వాసురెడ్డి తెలిపారు. 150 మందికిపైగా పాల్గొన్న పోటీల్లో బెస్ట్ ఆఫ్ సిక్స్‌లో నిలిసిన వెంకటేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొదటి స్థానం పొంది, ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనే లక్ష్యంతో సాధన చేస్తానని తెలిపారు.

సంతలో బాణసంచా దుకాణం



నాగలాపురం: మండల కేంద్రంలోని వారపుసంతలో బాణసంచా దుకాణం ఏర్పాటు చేశారు. ఇందుకు అధికారులు అనుమతి ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. మండలం కేంద్రంలోని ధర్మరాజుస్వామి ఆలయం వద్ద ప్రతి బుధవారం వారపు సంత నిర్వహిస్తుంటారు. ఈ వారపు సంతకు వేలాదిమంది జనం సైతం కూరగాయలు, నిత్యవసరాలు కొనడానికి వస్తుంటారు. దీపావళి పండుగ నేపథ్యంలో బుధవారం సంత జరిగిన ఈ ప్రాంతం వేలాది మంది కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. ఊహించని ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రేపటి నుంచి లక్ష బిల్వ, కుంకుమార్చన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని నవంబర్ ఒకటో తేదీ నుంచి 30 తేదీ వరకు లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలరోజుల పాటు ఈ పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆయుధపూజ



ఆయుధపూజలో పాల్గొన్న ఎస్‌ఐ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఆయుధపూజ ఘనంగా చేశారు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో దేవతామూర్తుల చిత్రపటాలకు పూజలు చేసి, గుమ్మడికాయలు, టెంకాయలను దిష్టి తీసి కొట్టారు. అలాగే బుధవారం పల్ల మాలలోని పచ్చాలమ్మ ఆలయంలో ఆటోవాలాలు ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. పచ్చాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, ఆటోలకు గుమ్మడికాయలు, టెంకాయలను దిష్టి తీసి, కొట్టారు.

సూచికబోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వస్త్రధారణపై అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు అన్నారు. అంతరాలయం దర్శనానికి ఈ విధానం అమల్లో ఉందని, అయితే రాహుకేతు పూజలకు కూడా తీసుకురావడం హర్షణీయమే కాని, అందుకు తగ్గ ఏర్పాట్లు మాత్రం ఆలయాధికారులు చేయలేదన్నారు. కేవలం మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా మాత్రమే చెబుతున్నారని, సూచికబోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో తెలియని భక్తులు దళారుల చేతిలో మోసపోయి అధిక ధరకు పంచెలను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డీఎస్పీ, డిప్యూటీ రేంజర్

శ్రీకాళహస్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం యానాది కాలనీకి చెందిన ఫారెస్టు వాచర్ వెంకటేష్ కుటుంబానికి పోలీసు, అటవీశాఖ అధికారులు ఆర్థికసాయం అందజేశారు. వెంకటేష్ మృతికి కారణమైన లారీ ఓనర్‌తో రూ.50 వేలు డీడీరూపంలో ఆయన భార్య పద్మకు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం కూడా త్వరలోనే అందజేస్తామని డీఎస్పీ నరసింహమూర్తి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ హామీ ఇచ్చారు.

విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నారాయణవనం: ప్రమాద రహిత దీపావళిని అందరూ జరుపుకోవాలంటూ విద్యార్థులు ర్యాలీ చేశారు. బుధవారం మండల కేంద్రమైన నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దీపావళి పండుగపై వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి, స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. దీపావళి సందర్భంగా జరిగే ప్రమాదాలను ఎదుర్కొనే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్లు సురేష్, శ్రీనివాసులు, పీడీలు సదాశివం, జయప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటికి దీప శోభ



శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. విద్యుత్ దీపాలంకరణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

-శ్రీకాళహస్తి





